పాఠ్య పుస్తకాలు విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి



ఎంఈఓ వెంకటయ్యకు వినతిపత్రం అందజేస్తున్న సమాఖ్య ప్రతినిధులు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి మండల పరిధిలోని ప్రైవేట్ స్కూల్స్‌లో నిబంధలకు విరుద్ధంగా పాఠ్య పుస్తకాలు విక్రయిస్తున్నారని, కఠిన చర్యలు తీసుకోవాలని గురువారం ఎంఈఓ వెంకటయ్యకు ఏఐఎఫ్‌డీఎస్ గ్రేటర్ హైదరాబాద్ కన్వీనర్ శ్రీకాంత్ వినతిపత్రం అందజేశారు. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు విద్యను వ్యాపారంగా మార్చుకొని లక్షలాది రూపాయలు ఫీజులు వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా కో కన్వీనర్ అరుణ తదితరులు పాల్గొన్నారు.

28న జగన్నాథ రథయాత్ర

మియాపూర్ : అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం (ఇస్కాన్) మియాపూర్ కేంద్రం ఆధ్వర్యంలో ఈ నెల 28న జగన్నాథ రథయాత్రను నిర్వహిస్తున్నామని మియాపూర్ ఇస్కాన్ టెంపుల్ అధ్యక్షులు శ్రీ రామ్‌దాస్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 28న మధ్యాహ్నం 2 గంటలకు చందానగర్‌లోని ఆర్‌ఎస్ బ్రదర్స్ నుండి ఈ రథయాత్ర ప్రారంభమవుతుందని తెలిపారు. రథయాత్ర మదీనాగూడ, ఆల్విన్ క్రాస్ రోడ్డు, మియాపూర్ క్రాస్ రోడ్డు, జేపీఎన్‌నగర్ మీదుగా విశ్వనాథ్ గార్డెన్ వద్ద ముగుస్తుందని తెలిపారు. అదేరోజు సాయంత్రం 6 గంటల నుండి 10 గంటల వరకు విశ్వనాథ్ గార్డెన్‌లో సమావేశం ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రభూజీల ప్రసంగాలు ఉంటాయని అనంతరం అన్నప్రసాద వితరణ ఉంటుందని తెలిపారు.ఈ రథయాత్ర, సమావేశంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మహిళ మెడలో నుంచి బంగారు గొలుసు అపహరణ

నిందితుడి అరెస్ట్, కేసు నమోదు

చందానగర్: మహిళ మెడలో నుంచి బంగారు గొలుసు అపహరించిన ఘటన చందానగర్ పోలీస్‌స్టేషన్‌లో చోటుచేసుకుంది. ఎస్‌ఐ ఆంజనేయులు తెలిపిన ప్రకారం వివరాలు...శేరిలింగంపల్లి ఓల్డ్ ఎంఐజీ– 730లో నివాసముండే పెదపాటి శాంతిలక్ష్మి గురువారం ఉదయం 6 గంటలకు ఇంటి ముందు ఊడుస్తుండగా గుర్తు తెలియని వ్యక్తి హోండా యాక్టివా బైక్‌పై వచ్చి వచ్చి 4 తులాల బంగారు గొలుసు లాక్కొని పారిపోయాడు. ఈ మేరకు బాధితురాలు చందానగర్ పోలీసులను ఆశ్రయించింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

గంటల వ్యవధిలోనే నిందితుడు అరెస్ట్..

మహిళ మెడలో నుంచి గొలుసు తస్కరించిన ఘటనలో గంటల వ్యవధిలోనే చందానగర్ పోలీసులు కేసును ఛేదించారు. బాధితురాలు ఫిర్యాదు మేరకు సీసీ కెమెరాలను పరిశీలించిన పోలీసులు గోపినగర్‌లో నివాసముండే అర్జున్ కుమారుడు కె.సూర్య (19)గా గుర్తించి యువకుడిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. నిందితుడు మదీనాగూడలోని శ్రీ చైతన్య కాలేజీలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత



శేరిలింగంపల్లి: ముఖ్యమంత్రి సహాయనిధి బాధితులకు అండగా నిలుస్తోందని కాంగ్రెస్ శేరిలింగంపల్లి ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ పేర్కొన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో రూ.3.58 లక్షల చెక్కులను బాధిత కుటుంబాలకు గురువారం అందించారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర లేబర్ సెల్ ఉపాధ్యక్షుడు నల్ల సంజీవరెడ్డి, నాయకులు వీరేందర్‌గౌడ్, సాంబశివరావు, శేఖర్, ఏకాంత్‌గౌడ్, రేణుక, యాదగిరి, కల్పనగౌడ్ పాల్గొన్నారు.

గురుపౌర్ణమి వేడుక కరపత్రాలు ఆవిష్కరణ

రాయదుర్గం: టెలికామ్‌నగర్‌లోని సాయిదత్త గణపతి ఆలయంలో గురుపౌర్ణమి వేడుక కరపత్రాలను గురువారం ఆలయ కమిటీ ,అర్చకులు విడుదల చేశారు. జూలై 10వ తేదీన ఉదయం 5.30 నుంచి రాత్రి 9 గంటల వరకు వేడుకలను నిర్వహించాలని నిర్ణయించారు. కాగడ హారతితో వేడుకల ప్రారంభం, గణపతి, దత్తాత్రేయస్వామి, సాయిబాబాలకు పంచామృతాభిషేకం, సామూహిక వ్రతాలు, మధ్యాహ్న మహా ప్రసాద వితరణ ఉంటుందన్నారు. తర్వాత సాయంత్రం 4 గంటలకు టెలికామ్‌నగర్ వీధుల్లో సాయిబాబా పల్లకి సేవ, రాత్రి భజన బృందంచే ప్రత్యేక భజన కార్యక్రమాలుంటాయని వెల్లడించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు రవీందర్‌రెడ్డి, రాజేంద్రప్రసాద్, నరేందర్‌రెడ్డి, అనిల్ పురోహితులు పాణి శర్మ, వెంకటేష్ పాల్గొన్నారు.

అటు మురుగు.. ఇటు డంపింగ్

అసంపూర్తిగా రేగులకుంట సుందరీకరణ పనులు



మియాపూర్: చందానగర్ డివిజన్ పరిధిలోని రేగులకుంట చెరువు సుందరీకరణ అసంపూర్తిగా మిగిలిపోయింది. ఒకప్పుడు సాగు, తాగునీరు అందించిన చెరువులు నేడు మురుగుమయంగా మారాయి. చెరువుల వద్ద కాలనీలు, అపార్ట్‌మెంట్లు వెలవడడంతో వాటినుండి వచ్చే డ్రైనేజీ చెరువులోకి చేరి దుర్వాసన వెదజల్లుతోంది. దీప్తిశ్రీనగర్ కాలనీ వాసులు దుర్వాసన భరించలేక సమస్యను ఎమ్మెల్యే గాంధీ దృష్టికి తీసుకువెళ్లగా ప్రభుత్వ సహకారంతో నెక్సస్‌మాల్ సీఎస్‌ఆర్ నిధులతో ,మల్లిగావాడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రేగులకుంట సుందరీకరణ పనులను చేపట్టారు. 6 నెలల కిందట పనులు ప్రారంభమయ్యాయి.

- చెరువు పైభాగం నుండి చెరువులోకి వచ్చే మురుగునీటిని చెరువు పక్కన కాల్వ తీసి మురుగునీటిని మళ్లించారు
- చెరువును ఖాళీ చేసి పూడిక తీయించి చెరువు చుట్టూ కట్ట ఏర్పాటు చేశారు. చెరువు కట్టపై చుట్టూ మొక్కలు నాటారు

- చెరువుకట్టపై గుంతలు
- ఇబ్బందిపడుతున్న వాకర్స్



- చెరువులో స్వచ్ఛమైన నీరు రావడంతో స్థానికులు చెరువుకట్టపై వాకింగ్ చేసేందుకు రోజు ఉదయం, సాయంత్రం వస్తున్నారు
- కాగా చెరువు పక్కన మురుగునీటి కాల్వలో గుర్రపుడెక్క, పిచ్చిమొక్కలు పెరిగాయి. దీనికితోడు దుర్గంధం.. భరించలేక వాకర్స్ ఇబ్బందులు పడుతున్నారు. చెరువు చుట్టూ పిచ్చిమొక్కలు పెరగడంతో పాములు, క్రిమికీటకాలు సంచరిస్తున్నాయి
- చెరువుకట్ట పక్కన 4 నెలల క్రిందట మురుగునీటి పైపులైన్ వేసేందుకు భారీ పైపులను తెచ్చారు. నెలలు గడుస్తున్నా పనులు చేపట్టడం లేదు

చెరువు చుట్టు ఏర్పాటు చేసిన కాల్వలో చెత్తచెదారం

- ఇక ఇటీవల కురిసిన వర్షానికి చెరువుకట్టపై మట్టి కొట్టుకుపోయి ఎత్తుపల్లాలుగా మారింది. దీంతో వాకింగ్‌కు ఇబ్బందులు కలుగుతున్నాయి. ధర్మపురి దేవాలయంకు వెళ్లే రోడ్డులో చెరువు పక్కనే కాల్వలో చెత్త డంపింగ్ చేస్తున్నారు. చెత్త కుళ్లిపోయి దుర్వాసన వస్తుంది
- ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి డ్రైనేజీ పైప్‌లైన్ పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



కాల్వలో పిచ్చిమొక్కలు





చెరువుకట్టపై గుంతలు ఏర్పడిన దృశ్యం

ఫ్లైఓవర్‌కు పీజేఆర్ పేరు పెట్టడం హర్షణీయం

గచ్చిబౌలి: గచ్చిబౌలిలోని శిల్పా లేఅవుట్ ఫ్లైఓవర్‌కు ప్రజా నాయకుడు జనార్దన్‌రెడ్డి పేరు పెట్టడంపై టీపీసీసీ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పురుషోత్తం హర్షం వ్యక్తం చేశారు. ప్రారంభానికి సిద్ధంగా ఉన్న గచ్చిబౌలి ఫ్లైఓవర్ వద్ద సీఎం రేవంత్ రెడ్డి, పీజేఆర్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖైరతాబాద్ నియోజకవర్గంలో పీజేఆర్ ప్రజల అభ్యున్నతి కోసం అహర్నిశలు కృషి చేశారని కొనియాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తింపు ఇవ్వడం సంతోషంగా ఉంన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రక్తపు జంగంగౌడ్, గడ్డం నర్సింగ్, వేణుగోపాల్, ఆంజనేయులు సాగర్, సాయిలు, నారాయణ నాయక్, శివ, నవీన్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న పురుషోత్తం తదితరులు

కార్పొరేటర్ల క్రీడోత్సవం -2025



క్రీడోత్సవంలో కార్పొరేటర్ జగదీశ్వర్ గౌడ్, చందానగర్ డీసీ మోహన్‌రెడ్డి తదితరులు

చందానగర్ : క్రీడల ద్వారా ఐక్యత, స్ఫూర్తితో ముందుకు సాగుదామని నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి జగదీశ్వర్‌గౌడ్ పేర్కొన్నారు.చందానగర్‌లోని పీజేఆర్ స్టేడియంలో కార్పొరేటర్ల క్రీడోత్సవం –2025ను సర్కిల్ –21 ఉపకమిషనర్ మోహన్‌రెడ్డితో కలిసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యకరమైన జీవనశైలి, స్నేహభావం ప్రోత్సహించేందుకు నిర్వహించబడిందన్నారు. కార్యక్రమంలో చందానగర్ సర్కిల్ –21 టౌన్‌ప్లానింగ్ ఏసీపీ నాగిరెడ్డి, ఏఎంహెచ్‌ఓ డాక్టర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గచ్చిబౌలి: మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు గచ్చిబౌలి ఏఈ వెంకట్ నారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు రాయదుర్గం, మధురానగర్, రాయదుర్గం పోలీస్‌స్టేషన్, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని చెప్పారు. విద్యుత్ సరఫరాలో అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

శేరిలింగంపల్లిలో..

శేరిలింగంపల్లి: విద్యుత్ మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరపరా నిలిపివేయనున్నట్లు నల్లగండ్ల ఏఈ వెంకట్‌నారాయణరెడ్డి తెలిపారు

–11 కేవీ డైమండ్‌హిల్స్ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు డైమండ్ హిల్స్ ఏరియాల్లో విద్యుత్ ఉండదు

–11 కేవీ గుల్‌మొహర్‌పార్కు కాలనీ ఫీడర్ పరిధిలో.. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తారు.

చందానగర్‌లో..

చందానగర్: తారానగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని

- రామాలయం ఫీడర్ పరిధిలో.. ఉదయం 10.00 నుంచి మధ్యాహ్నం 1.00 గంట వరకు హుడా ట్రేడ్ సెంటర్, ఓల్డ్ లింగంపల్లి, లింగంపల్లి సాయిబాబా టెంపుల్ ఏరియాలలో ..
- తారానగర్ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 2.00 నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు లింగంపల్లి, పోచమ్మ టెంపుల్, పీజేఆర్ స్టేడియం ఎదురుగా, శివాజీనగర్, తారానగర్ విలేజ్, రామాచారి స్కూల్ వెనకాల, తారానగర్ మసీద్ ప్రాంతాలలో విద్యుత్ ఉండదన్నారు.

మియాపూర్: రెడ్డి కాలనీ, కేంద్రీయ విహార్ ఫీడర్ల మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు కేంద్రీయ విహార్ అపార్ట్‌మెంట్స్, క్రికెట్ గ్రౌండ్ రోడ్డు, కొలంబస్ స్కూల్ రోడ్డు, రత్నదీప్ బ్యాక్‌సైడ్ ప్రాంతాల్లో, అదేవిధంగా మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు సాయికాలనీ, సాయిజ్యోతినగర్, రెడ్డి కాలనీ, బీకే ఎన్‌క్లేవ్, సెంటియా స్కూల్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని ఏఈ రవిచంద్ర ఓ ప్రకటనలో తెలిపారు.

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి అరెస్ట్

1.3 కిలోలు స్వాధీనం, కేసు నమోదు

చందానగర్: గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసిన సంఘటన చందానగర్ పోలీస్‌స్టేషన్‌లో చోటు చేసుకుంది. ఎస్‌ఐ ఆంజనేయులు తెలిపిన ప్రకారం వివరాలు...పాపిరెడ్డి కాలనీకి చెందిన హరినాథ్ (24), శివాజీ (25)లు మహారాష్ట్రలోని వర్లి నుంచి గంజాయి తీసుకువచ్చి పాపిరెడ్డి కాలనీలో అధిక రేట్లకు విక్రయిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం అందడంతో గురువారం సాయంత్రం 4.00 గంటలకు గంజాయి విక్రయిస్తుండగా పట్టుకున్నామన్నారు. వారి వద్ద నుంచి సుమారు 1.3 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేశామన్నారు.

నిర్మాణ అవసరాలను బట్టి సరైన స్టీల్ గ్రేడ్స్ వాడాలి

'ఎస్కీ' డైరెక్టర్ డా.రామేశ్వరరావు



'ఎస్కీ'లో వర్క్‌షాప్‌ను ప్రారంభిస్తున్న అతిథులు

రాయదుర్గం: స్టీల్ వాడకం నిత్య జీవితంలో ఒక భాగమైపోయిందని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా(ఎస్కీ) డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావు పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని 'ఎస్కీ' క్యాంపస్ లోని కన్వెన్షన్ సెంటర్ సెమినార్ హాల్‌లో 'డిజైన్ ఆఫ్ స్టీల్ స్ట్రక్చర్స్ విత్ లేటెస్ట్ ఇండియన్ కోడ్స్' అనే అంశంపై గురువారం వర్క్‌షాప్‌లను అతిథులతో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆకాశహర్మ్యాలు, భారీ కంటైనర్లు, భారం తట్టుకునే రహదారులు, సముద్రపు టన్నెల్స్, బ్రిడ్జిల వరకూ స్టీల్ వాడకమే ఆధారంగా ఉందన్నారు. అయితే ఈ నిర్మాణాల్లో నాణ్యమైన, అవసరానికి తగ్గ సూపర్ గ్రేడ్ స్టీల్‌ను వాడినప్పుడే భూకంపాల నష్టం తగ్గించగలుగుతామన్నారు. నాణ్యతలో రాజీ పడకుండా అవసరానికి అనుగుణంగా సరైన్ గ్రేడ్ స్టీల్‌ను ఎంపిక చేయడం అవసరమన్నారు.మహీంద్రా యూనివర్సిటీకి చెందిన డాక్టర్ అతుల్లాఖాన్ మాట్లాడుతూ స్టీల్‌లో పలు గ్రేడ్స్ ఉంటాయని, నిర్మాణ రకం ఆధారంగా వాటిని ఎంపిక చేయాలన్నారు. గాలులు, భారీ వర్షాలు, తుఫానులు, సునామీలు, భూకంపాలను తట్టుకునేలా ప్రత్యేక స్టీల్ గ్రేడ్స్ వాడాలన్నారు. శ్రీ టీఎంటీ-దేవశ్రీ ఇస్పాత్ సంస్థ మార్కెటింగ్ హెడ్ రాజీవ్ బిష్ట్ మాట్లాడుతూ స్టీల్ డిజైన్‌లో డెడ్‌లోడ్, లైవ్ లోడ్, విండ్ లోడ్, సీస్‌మిక్ లోడ్ వంటి వివిధ కోడ్స్‌ను అనుసరించాల్సి ఉంటుందన్నారు. సివిల్ అండ్ ట్రాన్స్‌పోర్టేషన్ ఇంజనీరింగ్ విభాగం హెడ్ డాక్టర్ వెంకట్‌రెడ్డి, కోర్స్ కోఆర్డినేటర్ సి హెచ్ తిలక్, ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎం సునీత తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీలోని సాయినగర్‌లో షిర్డీ సాయిబాబాకు గురువారం ప్రత్యేక పూజలు చేశారు. బీఆర్‌యస్ పార్టీ శేరిలింగంపల్లి సీనియర్ నాయకుడు ఎర్రబెల్లి సతీష్‌రావు హాజరై బాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు సురభి రమేష్‌రావు, సుబ్బారెడ్డి, పవన్‌కుమార్, మాధవరెడ్డి, సాయిగౌడ్, భూమయ్య తదితరులు పాల్గొన్నారు.



పార్టీ బలోపేతానికి కృషిచేయాలి

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్ యాదవ్



నియామక పత్రాలను అందజేస్తున్న నాయకుడు రవికుమార్ యాదవ్

మియాపూర్: నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పార్టీ బలోపేతానికి కృషిచేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్ యాదవ్ తెలిపారు. మియాపూర్‌లోని ఆర్‌బిఆర్ కాంప్లెక్స్‌లో మియాపూర్ డివిజన్ ప్రభారి మణిభూషణ్, నియోజకవర్గం కన్వీనర్ రాఘవేంద్రరావు, డివిజన్ అధ్యక్షులు లక్ష్మణ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో డివిజన్ నూతన కార్యవర్గ ప్రకటన, వికసిత్ భారత్ లక్ష్యంపై కార్యశాల నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై నూతన కార్యవర్గ సభ్యులకు నియామకపత్రాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ...కేంద్ర ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని సూచించారు. పర్యావరణంను దృష్టిలో ఉంచుకుని ప్రతి కాలనీ, బస్తీలలో మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. రాబోయే ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా కృషిచేయాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు మాణిక్‌రావు, నాగేశ్వర్‌గౌడ్, మహేష్, మనోహర్, స్రవంతి, నర్సింహరాజు, గణేష్, పట్టాభిరామ్, విజయేందర్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

'నిషా ముక్త్ భారత్ అభియాన్'.. బస్తీల్లో ర్యాలీలు



మధురానగర్‌లో అవగాహన ర్యాలీలో విద్యార్థులు, అంగన్‌వాడీ టీచర్లు

రాయదుర్గం/శేరిలింగంపల్లి: 'నిషా ముక్త్ భారత్ అభియాన్' పై ఐసీడీఎస్ శేరిలింగంపల్లి ప్రాజెక్ట్, రాయదుర్గం/గోపీనగర్ సెక్టార్ల ఆధ్వర్యంలో గురువారం ర్యాలీలు, అవగాహనా కార్యక్రమాలు నిర్వహించారు. లింగంపల్లి ప్రాథమిక పాఠశాలల్లో అవగాహన కల్పించారు. డ్రగ్స్, మాదక ద్రవ్యాలపై ఎలాంటి సమాచారం ఉన్నా వెంటనే టోల్‌ఫ్రీ నంబర్ 1908కు లేదా 100కు ఫోన్ చేయాలని సూచించారు. డ్రగ్స్, మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ ప్లకార్డులతో ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓ వెంకటయ్య, హెచ్ఎం శైలజ, సూపర్‌వైజర్లు కోమలి, మాధురి, పోలీసు అధికారులు అశోక్, శ్రీశైలం, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

మధురానగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల.. బస్తీలో ర్యాలీలు

మధురానగర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు మాదక ద్రవ్యాలపై అవగాహన కల్పించారు. అనంతరం మధురానగర్ బస్తీలో విద్యార్థులు ,అంగన్‌వాడీ టీచర్లు సంయుక్తంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమాన్ని ఐసీడీఎస్ శేరిలింగంపల్లి ప్రాజెక్ట్ సీడీపీఓ కవిత, సూపర్‌వైజర్ ఇందిర, డాక్టర్ సుధ, కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులు, ఇన్‌చార్జి రాజశేఖర్ పర్యవేక్షించారు. అంతకుముందు మధురానగర్ బస్తీలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థులు, అంగన్‌వాడీ టీచర్లు శ్రీలత, స్వప్న, సునీత, నాగమణి, జ్యోతి, శివలత, శారద తదితరులు పాల్గొన్నారు.

రేషన్..పరేషాన్!

- రోజుల తరబడి ప్రజల నిరీక్షణ
- ఇబ్బంది పడుతున్న డీలర్‌లు
- రేషన్ షాపులు పెంచాలని డిమాండ్
- పట్టించుకోని అధికారులు



నార్సింగిలో రేషన్‌షాపు వద్ద క్యూ

మణికొండ: ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతి 500 మంది కార్డు దారులకు ఓ రేషన్ షాపు ఉండాలి. అలాంటిది ఏకంగా ఒక్కో షాపునకు 1500 మంది లబ్ధిదారులు ఉన్నా షాపుల పెంపు విషయాన్ని అధికారులు పట్టించుకోవటం లేదు. ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా తెల్ల రేషన్‌కార్డు దారులు ఎక్కడైనా బియ్యం తీసుకునే అవకాశాన్ని కల్పించారు. ఉపాధి నిమిత్తం వచ్చి స్థిరపడిన వారు రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని గండిపేట, రాజేంద్రనగర్, శంషాబాద్ మండలాల పరిధిలోని రేషన్ షాపులలో బియ్యం తీసుకుంటున్నారు. గత నెల నుంచి రాష్ట్ర ప్రభుత్వం సన్నబియ్యాన్ని పంపిణీ చేస్తుండటం, జూన్ నెలలో కేంద్ర ప్రభుత్వం ఒకేసారి మూడు నెలల బియ్యాన్ని లబ్ధిదారులకు ఇవ్వాలని ఉత్తర్వులు ఇచ్చిన విషయం తెలిసిందే. దీంతో రేషన్ షాపుల వద్ద ఈనెల మొదటి వారం మొదలైన క్యూలైన్‌లు నెలాఖరు వచ్చినా ఏ మాత్రం తగ్గడం లేదంటే ఆయా మండలాల పరిధిలో బియ్యం తీసుకుంటున్న లబ్ధిదారుల సంఖ్యను అర్థం చేసుకోవచ్చు. జూన్‌లో ప్రతి లబ్ధిదారుడు మూడుసార్లు వేలి ముద్ర వేసి మూడుసార్లు బియ్యం తీసుకోవాల్సి వస్తుంది. దీంతో ఒక్కో లబ్ధిదారునికి 15 నిమిషాల సమయం పడుతుండటంతో డీలర్‌లు ప్రతిరోజూ 30 నుంచి 50 మంది లబ్ధిదారులకు మాత్రమే బియ్యాన్ని పంపిణీ చేస్తున్నారు.

అదనపు బాధ్యతలతో ఇబ్బంది..

గండిపేట మండల పరిధిలో అధికారుల లెక్కకు 26 రేషన్ షాపులు ఉన్నా వాటిల్లో మూడు పనిచేయటం లేదు. మణికొండలో ఓ షాపు మూత పడి ఏళ్లు గడుస్తున్నా కొత్త వారికి దాన్ని కేటాయించలేదు. మరో డీలర్‌కు అదనపు బాధ్యతలను కేటాయించటంతో రెండు షాపుల వారు ఒకే డీలర్ వద్ద బియ్యం తీసుకుంటున్నారు. ఇదే తరహాలో పుప్పాలగూడలోని షాపును నార్సింగి డీలర్‌కు అదనంగా కేటాయించారు. దీంతో అతను ఒక రోజు నార్సింగిలో, మరో రోజు పుప్పాలగూడలో బియ్యాన్ని ఇస్తున్నారు. నార్సింగిలో అధికారుల లెక్క ప్రకారం మూడు షాపులు ఉన్నా రెండు మాత్రమే పనిచేస్తున్నాయని, అందులో ఒక డీలర్ పుప్పాలగూడలోను ఇస్తున్నారని స్థానికులు వాపోతున్నారు.

36కు బదులుగా 23 షాపులు..

గండిపేట మండల పరిధిలో ఇటీవల ఇచ్చిన కొత్త కార్డులు కాకుండానే 15,502 రేషన్ కార్డులు, 622 అంత్యోదయ కార్డులు ఉన్నాయి. ప్రభుత్వ లెక్కల ప్రకారమే ఒక్కో రేషన్ షాపునకు 500 కార్డుల చొప్పున కేటాయిస్తే 32 రేషన్ షాపులను కేటాయించాల్సి ఉంది. అలాంటిది లెక్కలలో 26 ఉన్నా అందులో 23 మాత్రమే పనిచేస్తుండటంతో డీలర్‌లపై పనిభారంతో పాటు లబ్ధిదారులకు పలుమార్లు షాపుల చుట్టూ తిరగాల్సి వస్తుందని వారు వాపోతున్నారు. ఇటీవల ప్రభుత్వం మంజూరు చేసిన కొత్త కార్డులు గండిపేట మండల పరిధిలో మరో 2వేల వరకు ఉన్నట్టు సమాచారం. మరో నాలుగు షాపులను ఇవ్వాల్సి ఉంది.



బియ్యం రాక నార్సింగిలో మూసి ఉన్న రేషన్‌షాపు

రెవెన్యూ అధికారులే షాపుల సంఖ్య పెంచాలి..

ఏ మండలం, డివిజన్‌లోనైనా రేషన్ షాపులను పెంచాల్సిన అవసరాన్ని తెలియజేస్తూ రెవెన్యూ శాఖ వారే జిల్లా కలెక్టర్‌కు నివేదిక పంపాలి. కలెక్టర్ రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్‌కు ఆ విషయాన్ని తెలుపుతూ లేఖ రాస్తారు. కమిషనర్ అనుమతి ఇస్తే కొత్త షాపులను ఏర్పాటు చేసుకోవచ్చు. గండిపేట తహసీల్దార్, రాజేంద్రనగర్ ఆర్డీఓలు షాపుల పెంపు విషయాన్ని కలెక్టర్‌కు రాస్తే పెంపు విషయం పరిశీలిస్తాం.

– వనజాక్షి, జిల్లా పౌర సరఫరాల అధికారి

సమీపంలో ఏర్పాటు చేయాలి



మణికొండ గ్రామంలో గతంలో రెండు రేషన్‌షాపులు ఉండగా ప్రస్తుతం ఒకటి మాత్రమే ఉంది. అది మణికొండ క్వార్టర్స్, చిత్రపురి కాలనీవాసులకు దూరంగా ఉంది. దీంతో ఎంతో వ్యయప్రయాసలకు ఓర్చి పలుమార్లు షాపునకు వెళ్లి గంటల తరబడి లైన్‌లో నిల్చుని బియ్యం తీసుకుంటున్నారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి కార్డుల నిష్పత్తికి అనుగుణంగా రేషన్ షాపులను పెంచడంతో పాటు వాటిని లబ్ధిదారులకు సమీపంలో ఏర్పాటు చేయాలి.

–గణేష్, మణికొండ

రోజుల తరబడి తిరుగుతున్నాం



మూడు నెలల బియ్యం ఒకేసారి ఇవ్వడం, సన్న బియ్యం ఇస్తుండటంతో కార్డు ఉన్న ప్రతిఒక్కరూ షాపునకు వచ్చి తీసుకుంటున్నారు. దీంతో ప్రతిరోజు వందల మంది షాపుల వద్ద పడిగాపులు కాయాల్సి వస్తుంది. కొందరు వారం, పది రోజుల పాటు పనులన్నీ మానుకుని బియ్యం తీసుకోవాల్సి వస్తుంది. స్థానికుల కంటే ఇతర ప్రాంతాల వాసులు అధికంగా బియ్యం తీసుకునేందుకు వారి సమీపంలోని రేషన్ షాపులకు వస్తున్నారు.

– మహమ్మద్ అఫ్రోజ్, నార్సింగి

కలెక్టర్‌కు నివేదిక పంపిస్తాం..



గండిపేట మండల పరిధిలో బియ్యం తీసుకుంటున్న లబ్ధిదారుల సంఖ్య పెరిగింది. ఈనెల మూడు నెలల బియ్యం ఇవ్వటంతో ఒక్కొక్కరికే ఎక్కువ సమయం తీసుకుంటున్న విషయం వాస్తవం. స్థానికులకంటే ఎక్కువ మంది ఇతర జిల్లాల వారు బియ్యం తీసుకుంటున్నారు. పౌరసరఫరాల శాఖ వారు షాపులను పెంచాలని తమకు లేఖ రాస్తే డీలర్‌ల ఎంపిక చేపడతాం. అయినా ప్రజల ఇబ్బందిని తీర్చేందుకు ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్‌కు నివేదిక పంపిస్తాం.

–శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్, గండిపేట